సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



అమ్మపాలు అమృతం

బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు కావాలంటూ ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 7 వరకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 8లో



ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలు, చట్టపరంగా తీసుకునే చర్యలపై నూజివీడు ట్రిపుల్ ఐటీలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 8లో



ప్రాణాలు తీసిన అతివేగం

డ్రైవర్ అతివేగం రెండు నిండు ప్రాణాలను బలిగొంది. ద్వారకాతిరుమల మండలంలోని లైన్ గోపాలపురం శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. 8లో

నిమ్మల రెడ్‌బుక్ రాజ్యాంగం

- వైఎస్సార్‌సీపీ నేతలపై వేధింపుల పర్వం
- ఎంపీపీ ఎన్నికల సమయంలో ఒకే రోజు 42 మందిపై మూడు కేసులు
- ఎస్సీ, ఎస్టీలపై పాలకొల్లులో అట్రాసిటీ కేసు
- 2022 ఘటనపై సీబీసీఐడీ ఎంక్వైరీ
- ఆదర్శ ఎమ్మెల్యే, మంత్రి అంటూ సోషల్ మీడియాలో ప్రచారం
- బయటికి మాత్రం రాజకీయ వేధింపుల వ్యవహారం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఆయన అత్యంత మంచి వ్యక్తి. బొకేలు, స్వీట్ బాక్సులు బదులు కూరగాయల కవర్లు మాత్రమే తీసుకుంటారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కార్పెట్లు వేయకుండా అత్యంత సాధారణంగా చేయాలని చెబుతుంటారు. రాష్ట్ర మంత్రయినా అత్యంత నిరాడంబర జీవితం. రోడ్లపైనే టిఫిను తినడం, పగలు, రాత్రి అనే తేడా లేకుండా పనిచేసే గొప్ప రాజకీయ నాయకుడు'

ఇదంతా సోషల్ మీడియాలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురించి ఆయన సొంత టీం ఊదరగొట్టే వ్యవహారం. పాలకొల్లులో మాత్రం ఆయన పొలిటికల్ రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్‌సీపీ లీడర్లను, కేడర్లను వేధింపులకు గురి చేస్తూ వరుస కేసులతో హడావుడి చేస్తున్నారు. ఇందులో ఇంకో ప్రత్యేకత ఏమిటంటే దళిత హక్కులను పరిరక్షించే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దళితులపైనే ప్రయోగించడం.

పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు రెడ్‌బుక్ హడావుడి చాపకింద నీరులా కొనసాగిస్తున్నారు. సమయం, సందర్భం చూసుకుని మరీ ప్రత్యర్థులను టార్గెట్ చేసుకుని ముప్పుతిప్పలు పెట్టేలా వేధింపుల కేసులకు తెర తీశారు. పాలకొల్లు రాజకీయాల్లో మునుపెన్నడూ లేని కొత్త సంస్కృతికి నిమ్మల బీజం వేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. 2022లో టిడ్కో ఇళ్ళ గృహ ప్రవేశాల సందర్భంగా జరిగిన చిన్నపాటి వాదనపై తాజాగా సీబీసీఐడీ ఎంక్వైరీ వేయించడం, కొద్ది నెలల క్రితం జరిగిన యలమంచిలి ఎంపీపీ ఎన్నికల సందర్భంగా ముగ్గురు వ్యక్తుల ఫిర్యాదుతో 42 మందిపై ఒకేరోజు కేసు నమోదు చేయడం ఇంకొక సంచలనం. అధికారంలో ఉంటే ఒకలాగా.. ప్రతిపక్షంలో ఉంటే మరోలా వ్యవహరించే నిమ్మల మంత్రి కావడంతో రెడ్‌బుక్ పేరుతో వేధింపులను తీవ్రతరం చేస్తున్నారు.

ఎంపీపీ ఎన్నికల స్పెషల్ కేసు

పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని యలమంచిలి ఎంపీపీ ఎన్నిక మార్చి 26, 27 తేదీల్లో నిర్వహించారు. టీడీపీకి నామమాత్రపు బలం కూడా లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ సభ్యులను టీడీపీలోకి తీసుకోవడానికి మంత్రి నిమ్మల రకరకాల ప్రయత్నాలు చేసి భంగపడ్డారు. ఈ క్రమంలో ఎన్నిక వాయిదాకు సరికొత్త ప్రయత్నం చేశారు. దీనిలో భాగంగా మార్చి 27న పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని కానిస్టేబుల్ ఫిర్యాదుతో 17 మందిపైన, అదేరోజు వీఆర్‌ఓ విధులకు ఆటంకం కలిగించారని 9 మంది పైన కేసులు నమోదు చేశారు. అదేరోజు టీడీపీ నాయకుడి ఫిర్యాదుతో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడాల గోపి, కీలక నేతలు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ సహా 9 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. దీనిలో ప్రత్యేకత ఏమిటంటే ముగ్గురు ఎస్సీల పైన, ఒక ఎస్టీ పైన అట్రాసిటీ కేసు నమోదు చేయడం.

వాదులాట ఘటనకు సీబీసీఐడీ కేసా?

2022 ఆగస్టు 5న పాలకొల్లులో టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులకు గృహాల పంపిణీ జరిగింది. నిమ్మల రామానాయుడును స్థానిక ఎమ్మెల్యే హోదాలో ప్రొటోకాల్ ప్రకారం కార్యక్రమానికి ఆహ్వానించారు. శిలాఫలకంలో నిమ్మల పేరు పెద్దగా లేదనే కారణంతో 50 మంది కార్యకర్తలతో ప్లకార్డులతో సభలోకి వచ్చి హడావుడి చేశారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలకు, నిమ్మలకు మధ్య వాగ్వాదం జరిగింది. కట్ చేస్తే... 2024లో టీడీపీ అధికారంలోకి రాగానే డిసెంబర్ 13న తాడి శశిధర్ అనే వ్యక్తితో మంత్రి ఫిర్యాదు చేయించారు. కేసులో 24 మందిపై ఫిర్యాదు అందడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. కొందరు బెయిల్ తీసుకోగా, మరికొందరు హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఈ కేసులో పోలీసులు మే నెలలో చార్జిషీట్ దాఖలు చేయడంతో ఏలూరు జిల్లా కోర్టులో 861/2025 నెంబరుతో కేసు నడుస్తోంది. గురువారం వాయిదా జరిగింది. ఇదే కేసును మంత్రి ఆదేశాలతో గత వారం సీబీసీఐడీకి అప్పగించారు. ఇలా చిన్న ఘటనలకు కూడా భూతద్దంలో చూపి వేధింపులకు తెరతీయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ప్రజలపై విద్యుత్ భారం



స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న బాబూరావు

భీమవరం: విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చడాన్ని తక్షణం ఆపాలని స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు సీహెచ్ బాబురావు డిమాండ్ చేశారు. పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు నమ్మకద్రోహం చేస్తుందని గత ప్రభుత్వంలో అదానీ ఒప్పందాలను వ్యతిరేకించి నేడు అదే పద్ధతి అవలంబించడం దారుణమన్నారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి వాటిని విస్మరించి ప్రజలపై మరిన్ని భారాలు వేయడానికి సిద్ధపడుతుందని విమర్శించారు. రైతులకు ఇస్తామన్న భరోసా రూ.3,500 కోట్లు అయితే విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై వేసే భారం సుమారు రూ.12 వేల కోట్లని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రూ ఆప్, సర్దుబాటు చార్జీల పేరుతో కరెంటు చార్జీలు పెంచుతున్న ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు కోసం అదే బిల్లును అడ్డం పెట్టుకుని సంక్షేమ పథకాలకు దూరం చేస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈ నెల 5న రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసన చేయాలని ఐక్యవేదిక పిలుపునిస్తున్నట్లు చెప్పారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీఐటీయు జిల్లా నాయకుడు బి.వాసుదేవరావు, అఖిల భారత కిసాన్ సభ నాయకుడు లంక కృష్ణమూర్తి, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్, చింతకాయల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పారిశుద్ధ్య చర్యలు



బి.కొండేపాడులో డ్రైనేజీల్లో సిల్ట్ తీయిస్తున్న పంచాయతీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

పెంటపాడు: గ్రామాల్లో పారిశుద్ధ్య లేమి పేరిట సాక్షిలో ఈ నెల 1న ప్రచురితమైన వార్తకు మండల అధికారులు స్పందించారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు కొండేపాడులో శనివారం గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీల్లో సిల్ట్ తీయించారు. చెత్తను జేసీబీల సాయంతో తొలగించారు.

జాయింట్ పట్టా భూముల విభజనకు అవకాశం

భీమవరం (ప్రకాశం చౌక్): పశ్చిమ గోదావరి జిల్లాలోని రీసర్వే పూర్తి అయిన గ్రామాలలో వెబ్ ల్యాండ్ 2.0 లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు, తమ భూములను వ్యక్తిగతంగా విభజించుకొనేందుకు అవకాశం కల్పించారని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. భూ విభజన కోసం సాధారణంగా వసూలు చేసే రూ.500 ప్రభుత్వ రుసుంను పూర్తిగా మాఫీ చేసినట్లు తెలిపారు. భూ యజమానులు కేవలం రూ.50 నామమాత్రపు దరఖాస్తు రుసుంను గ్రామ సచివాలయంలో చెల్లించి, వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రత్యేక అవకాశం ద్వారా జాయింట్ పట్టాదారులు తమ భూములను విభజించుకుని గ్రామ సచివాలయంలో అర్జీ దాఖలు చేసుకుని, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు.

అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

ఉండి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను శనివారం ఎన్నార్పీ అగ్రహారం కేవీకేలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు మూడు విడతల్లో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. అనంతరం ప్రధానమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారంలో నాయకులు, రైతులు వీక్షించారు.

నవోదయ ప్రవేశాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

భీమవరం: రానున్న విద్యాసంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోడానికి ఆగస్టు 13 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈ.నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులను పరిపాలన కారణాలు, తల్లిదండ్రుల విజ్ఞప్తుల మేరకు గడువు పొడిగించినందున అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయ అవార్డుల నామినేషన్స్‌కు 8 వరకు గడువు

భీమవరం: గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఈనెల 8లోగా నామినేషన్స్‌ను సంబంధిత ఉప విద్యాశాఖాధికారులకు అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు నీట్ పీజీ పరీక్ష

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైద్య కళాశాలల్లో వైద్య విద్యలో ఎండీ, ఎంఎస్, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం నీట్ పరీక్ష ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ జరగనుంది. ఏలూరులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 200 మంది విద్యార్థులకు, సిద్ధార్థ క్వెస్ట్ విద్యా సంస్థలో 174 మందికి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు రాసే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి 8.30 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. విద్యార్థులు తమ అడ్మిట్ కార్డులను, ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలి.

రూపాయికే బీఎస్ఎన్ఎల్ సిమ్

ఏలూరు (టూటౌన్): స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఒక్క రూపాయికే ఉచిత సిమ్ అందిస్తుందని టెలికాం జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను తెలిపారు. స్థానిక జిల్లా టెలికాం జీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఉచిత సిమ్‌తో పాటు అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ డేటా, వంద ఎస్ఎంఎస్‌లు, 30 రోజుల కాల వ్యవధితో అందజేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డెక్కిన ఉపాధ్యాయులు



భీమవరం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల ధర్నా

భీమవరం: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం భీమవరం కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం మొండివైఖరి అవలంభిస్తుందని విమర్శించారు. పీఆర్సీ కమిషన్ ప్రకటించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, బకాయి పడ్డ డీఏలను విడుదల చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించి బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖ అధికారి పోస్టులను ఉమ్మడి సీనియార్టీ ప్రకారం జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇవ్వాలని, సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి 2003 ముందు నియమించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, సరెండర్ లీవ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. ప్రతి హైస్కూల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియం కొనసాగించాలని, 11వ పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు మురాల సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ఫ్యాప్టోను చర్చలకు పిలవకుంటే ఈ నెల 12న రాష్ట్రవ్యాప్తంగా విజయవాడలో ధర్నా చేస్తామని ప్రకటించారు. ధర్నాకు ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో చైర్మన్ విజయరామరాజు, జనరల్ సెక్రటరీ జి.ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

అమెరికా పన్నుతో ఆక్వా రైతు కుదేలు



సమావేశంలో మాట్లాడుతున్న గాంధీ భగవాన్‌రాజు

పాలకొల్లు సెంట్రల్: అమెరికా విధించిన 25 శాతం పన్నుతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అన్నారు. శనివారం మండలంలోని పూలపల్లిలో ఎస్ఎస్ఎస్ కల్యాణ మండపంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమెరికా పన్నుల భారంతో ఆక్వా కంపెనీలు కొనుగోలు ధరల్లో రూ.40 నుంచి రూ.50 ధరను తగ్గించేశారన్నారు. దీంతో ఆక్వా సాగు అంటే రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. సరుకు లేకపోవడంతో గత 20 రోజులుగా వంద కౌంట్ రూ.260 నుంచి రూ.270 వరకూ కొన్నారని.. అమెరికా సుంకం సాకుతో వంద కౌంట్‌కు రూ.20 తగ్గించి కొంటున్నారన్నారు. మిగిలిన కౌంట్‌కు మాత్రం రూ.50 తగ్గించి కొంటున్నారన్నారు. ఇప్పటికే ఆక్వా రైతులు చాలా నష్టపోయారని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆక్వా ఫీడ్ కంపెనీలు, ప్రాసెసింగ్ యూనిట్లతో సమావేశం ఏర్పాటుచేసి ఆక్వా రైతులకు న్యాయం చేయాలన్నారు. భవిష్యత్‌లో రాష్ట్రంలో రైతులు ఆక్వాకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వరి లాగా ఆక్వా రైతులకు కూడా మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలని అన్నారు. ఆక్వా రైతులపై రాష్ట్ర ప్రభుత్వానికి సరైన శ్రద్ధ లేదన్నారు. ఆక్వా రైతులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తే ప్రభుత్వానికి మంచిదని అన్నారు. కార్యక్రమంలో బోణం చినబాబు, అంగర వరప్రసాద్, దాట్ల సోంబాబు, జగ్గురోతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒలుపులో వెరైటీలెన్నో!

- కొబ్బరి ఒలుపులో పదికి పైగా రకాలు
- పిలక, బొంబాయి సీలు, మూడు నామాలు, కసింగలు, పోర్‌పట్టా, బోరాలు
- రాష్ట్రాన్ని బట్టి ఒలుపు మారుతుందంటున్న కార్మికులు
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో 50 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు
- జిల్లా నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతి

సండే స్పెషల్



కాయలను ఒలుస్తున్న కార్మికుడు

సాక్షి, భీమవరం: కొబ్బరి కాయ ఒలవడం తెలికేనని తీసి పారేయకండి. దానికీ ఓ పద్ధతుంది. బొండాం, ముప్పేట, ముదర కాయ, కురిడీ అంటూ కాయల్లో రకాలున్నట్టే.. పిలక, బొంబాయి సీలు, కసింగలు, పోర్‌పట్టా, బోరాలు, మూడు నామాలు.. అంటూ ఒలుపుల్లోనూ పదికి పైనే వెరైటీలు ఉన్నాయి. ప్రాంతాన్ని బట్టి ఒలుపులు మారుతుంటాయి. ప్రస్తుతం రికార్డు ధరతో జిల్లా నుంచి రోజుకు దాదాపు వంద లారీల కొబ్బరి కాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. అక్కడి అవసరాలకు తగ్గట్టు ఇక్కడి ఒలుపు కార్మికులు వడివడిగా కాయలను వలుస్తున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని సుమారు 50 వేల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. ఆచంట, పాలకొల్లు, నరసాపురంలోని వశిష్ఠ గోదావరి, సముద్ర తీరం వెంబడి, భీమవరం, ఉండి, ఆకివీడు ప్రాంతాల్లోని ఆక్వా చెరువు గట్లు, తాడేపల్లిగూడెం, ఏలూరు, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, తణుకు ప్రాంతాల్లో తోటలు సాగు చేస్తున్నారు. జిల్లా నుంచి రాజస్తాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, బీహార్, పంజాబ్, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతి అవుతున్నాయి. తమిళనాడు, కేరళ తర్వాత మన కొబ్బరికి దేశ వ్యాప్తంగా గిరాకీ ఉన్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. తమిళనాడులో దిగుబడి తగ్గడంతో నెలన్నర రోజులుగా జిల్లా నుంచి ఎగుమతులకు డిమాండ్ ఏర్పడింది. మునుపెన్నడూ లేనివిధంగా రైతు ధర కాయకు రూ.18 నుంచి రూ.20 మధ్య నిలకడగా ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు వంద లారీల వరకు కాయలు ఎగుమతి అవుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.

ఒలుపులో రకాలెన్నో..

హిందూ సంప్రదాయంలో కొబ్బరి కాయకు ఎంతో విశిష్టత ఉంది. పూజల్లో కొట్టడం నుంచి హోమాల్లో కాయ పళంగా వేయడం, దిష్టి, దిగదుడుపు తీయడం తదితర ప్రతి పనిలోనూ కొబ్బరికాయ ఉండాల్సిందే. మన ప్రాంతంలో ముచ్చిక, పిలకతో ఒలిచిన వాటిని వినియోగించినట్టే ఇతర ప్రాంతాల్లో వివిధ రూపాల్లో ఒలిచిన కాయలను వాడుతుంటారు. ఈ మేరకు జిల్లా నుంచి ఎగుమతులు జరిగే రాష్ట్రాల్లోని అవసరాలకు తగ్గట్టు కాయలను ఒలుస్తుంటారు. వీటిలో పిలక, బొంబాయి సీలు, రాయపూర్ సీలు, మూడు నామాలు, కసింగలు, బోరాలు, బెల్ట్ పోర్ పట్టా, బెల్ట్ లెస్ పోర్‌పట్టా, ఐదు పేళ్లు, ఆరు పేళ్లు, ఎనిమిది పేళ్లు తదితర పదికి పైనే ఒలుపుల్లో రకాలున్నాయి. ఎగుమతి అయ్యే ప్రాంతంలో ఆయా ఒలుపులకు ఏ పేర్లున్నా కానీ స్థానికంగా తాము ఈ విధంగా పిలుచుకుంటామని వ్యాపారులు, ఒలుపు కార్మికులు అంటున్నారు.

రాయపూర్ సీలును కాయ వెనుక నుంచి మూడు పేళ్లుగా ఒలిస్తే, కసింగలను ముందు నుంచి మూడు, వెనుక నుంచి మూడు పేడులుగా కాయపైన పీచు ఉంచి డొక్కను ఒలుస్తారు. బెల్టు పోర్‌పట్టా కోసం కాయకు నాలుగు వైపులా మధ్యలో అరంగుల డొక్క ఉంచి మిగిలిన దానిని తీసివేస్తారు. బెల్టు లెస్ కోసం నాలుగు వైపులా స్క్వేర్ ఆకారంలో పీచు ఉండేలా డొక్కను ఒలుస్తారు. అదేమాదిరి ఐదు పేళ్లు, ఆరు పేళ్లు, ఎనిమిది పేళ్ల సంఖ్యను బట్టి అన్ని పేళ్లుగా పైడొక్కను తొలగిస్తారు. మూడు నామాల కోసం కాయకు మూడు వైపులా అంగుళం వెడల్పున పీచు ఉంచి మిగిలిన డొక్కను పీచు సహా తీసేస్తారు. బొంబాయి సీలు కోసం కాయకు సగభాగం పూర్తిగా పీచును ఒలిచేసి మిగిలిన సగభాగం ఉంచేస్తారు. ఇలా వివిధ రకాలుగా కాయలను ఒలుస్తుంటారు.



బొంబాయి సీలు



ఎనిమిది పేళ్లు



మూడు నామాలు



పోర్‌పట్టా



పిలక కాయ


ఏ ఒలుపు ఎక్కడికి..

బెల్ట్‌లెస్ పోర్‌పట్టా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి జరిగితే బోరాలు యూపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు, ఆరు పేళ్లు యూపీ, కర్ణాటక, రాయపూర్ సీలు, ఐదు పేళ్లు మహారాష్ట్రకు, పిలకలు ముంబయి, బిహార్‌కు, మూడు నామాలు మహారాష్ట్రకు, కసింగలు అన్ని ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయని వ్యాపారులు చెబుతున్నారు. ఆయా ప్రాంతాల్లో చాలా వరకు కొట్టకుండా వీటిని నేరుగా హోమాల్లో వేస్తారన్నారు. కాయపళంగా కన్నా ఒలిపించడం వల్ల బరువు తగ్గి ఎక్కువ కాయలు తీసుకువెళ్లే వీలుంటుందని అక్కడి అవసరాలకు తగ్గట్టు ఇక్కడే ఒలిపించుకుని తీసుకువెళతారని అంటున్నారు. కావాల్సిన ఆకారంలో వేగంగా కాయలు ఒలవడం అనుభవంతో కూడిన పని. ఒక్కో కాయ ఒలుపునకు రూ.1.50 చొప్పున ఇస్తారు. రోజుకు ఒక్కో కార్మికుడు 800 నుంచి 1000 కాయలను ఒలుస్తుంటారు.

గండీర.. గటగట

ఉత్తరాది రాష్ట్రాల్లో కురిడీ కొబ్బరి ఆహారంలోనూ భాగంగా ఉంటుంది. ఇవి ఎక్కువగా రాజస్తాన్, మధ్యప్రదేశ్‌కు వెళుతుంటాయి. బాగా తయారైన కాయలను ఎంపిక చేసి ఎనిమిది పేళ్లగా ఒలుస్తారు. గోదాముల్లో గాలి తగిలేలా అరలు కట్టి కాయలను నిల్వ చేస్తారు. ఆరు నెలలకు లోపలి నీరు పూర్తిగా ఇంకిపోయి గుడ్డు మాత్రమే ఉంటుంది. మొదట్లో 600 గ్రాముల నుంచి 700 గ్రాములు ఉన్న కాయ బరువు కురిడీ అయ్యేసరికి 80 గ్రా. నుంచి 100 గ్రా.కు తగ్గిపోతుంది. నాణ్యమైన గండీర, సెకండ్ క్వాలిటీని గటగటగా పిలుస్తుంటారు. గండీరకు రూ.30 ఉండగా గటగటకు రూ.28 ధర ఉన్నట్టు చెబుతున్నారు.


అవసరాన్ని బట్టి ఒలుపు



ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఒలిచిన కాయలను వినియోగిస్తుంటారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్డరు మేరకు వారికి అవసరమైన రీతిలో ఒలిపించి ఎగుమతి చేస్తుంటాం. తమిళనాడులో దిగుబడులు తగ్గడంతో ప్రస్తుతం జిల్లా నుంచి ఎగుమతులు బాగున్నాయి. రైతులకు రికార్డు ధర వస్తోంది.

– కాసా సత్యనారాయణ, వ్యాపారి, యలమంచిలి, పశ్చిమగోదావరి జిల్లా

నాలుగు దశాబ్దాల అనుభవం



నలభై ఏళ్లగా ఒలుపు పని చేస్తున్నాను. ఒక్కో ప్రాంతం నుంచి వచ్చిన వారు ఒక్కో విధంగా ఒలవమని చెబుతుంటారు. ఏ రకంగా ఒలవాలన్నా దాదాపు ఒకే సమయం పడుతుంటుంది. ప్రస్తుతం సీజన్ కావడం వల్ల పని ఎక్కువగా ఉంది.

– కొడవటి ఎర్రియ్య, ఒలుపు కార్మికుడు, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా

అమ్మపాలు బిడ్డకు అమృతం

- ఈ నెల 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు
- జిల్లాలో 6,592 మంది బాలింతలకు అవగాహన

కైకలూరు: వ్యాధులకు కారణం పోతపాలు.. బిడ్డ సరైన ఎదుగుదలకు కావాలి తల్లిపాలు అంటూ ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నుంచి జిల్లాలో ప్రారంభమయ్యాయి. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం(ఐసీడీఎస్) పర్యవేక్షణలో ఏలూరు జిల్లాలో 2,226 అంగన్‌వాడీ కేంద్రాల్లో 7వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గర్భిణులు, శిశుతల్లులు, యువతులకు క్విజ్ పోటీలు, బొమ్మలు, పోస్టర్లు, బ్యానర్లతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. పుట్టిన గంటలోపే ముర్రిపాలు పట్టించడంపై నెలకొన్న తల్లుల అపోహలను తొలగించే దిశగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు.

తల్లి పాలకు ప్రాధాన్యత ఇవ్వండి

ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ×తల్లిపాలకు ప్రాధాన్యత నివ్వండి, స్థిరమైన మద్దతు వ్యవస్థలను సృష్టించండి€ అనే నినాదంతో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 120 దేశాల్లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఏలూరు జిల్లాలో 6 నెలల నుంచి మూడు సంవత్సరాల వయస్సు పిల్లలు 48,563, మూడేళ్ల వయస్సు నుంచి ఆరేళ్ల వరకు 23,499 పిల్లలు ఉన్నారు. ఇక జిల్లాలో గర్భవతులు 8,861, బాలింతలు 6,592, కౌమారదశ బాలికలు 21,498 మంది ఉన్నారు.

తల్లిపాల వల్ల బిడ్డ పొందే లాభాలు

- తల్లి పాలలో శిశువు పెరుగుదలకు అవసరమైన ప్రోటీన్లు, కొవ్వులు, విటమిన్లు ఖనిజాలు సమతుల్యతలో ఉంటాయి.
- తల్లిపాలు తాగే బిడ్డలో 8 ఐ.క్యూ పాయింట్లు తల్లిపాలు తాగని బిడ్డ కంటే ఎక్కువ ఉంటాయి.


తామరకొల్లులో తల్లిపాలపై అవగాహన కలిగిస్తున్న సెక్టార్ సీడీపీవో డాక్టర్ దీప్తి



తల్లిపాల వారోత్సవాల పోస్టర్

- మెదడు అభివృద్ధి చెందడంతో పాటు రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది.
- బాల్య ఊబకాయం, టైప్ – 2 డయాబెటిస్, ఉబ్బసం, కొన్ని రకాల బాల్య ల్యుకేమియా వ్యాధులు వచ్చే ప్రమాదం తక్కువగా ఉంటుంది.
- తల్లిపాలు సులభంగా జీర్ణమవుతాయి. బిడ్డకు మలబద్ధకం, కడుపునొప్పి రాదు.
- బిడ్డకు కావలసిన ఇనుము, కాల్షియం అందడంతో రక్తహీనత రాదు.
- బిడ్డ చూపు, వాసన, వినికిడి, రుచి, స్పర్శ వంటి జ్ఞానేంద్రియాలు అభివృద్ధి.

తల్లికి కలిగే ప్రయోజనాలు

- తల్లి పాలివ్వడం వల్ల తల్లికి రొమ్ము, ఓవరీస్ కాన్సర్‌లు, ఆస్టియో పోరోసిస్(ఎముకలు పటుత్వం కోల్పోవడం) జబ్బులు రావు.
- తల్లి, బిడ్డ మధ్య బలమైన భావోద్వేగ సంబంధాన్ని ప్రోత్సహిస్తుంది.
- అధిక రక్తపోటు, గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్ తగ్గించవచ్చు.
- డయాబెటిక్ తల్లులు బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల ఇన్సులిన్ తీసుకునే అవసరం తగ్గుతుంది.
- తల్లిపాలు ఇవ్వడం వల్ల ఆక్సిటోసిన్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. ఇది గర్భాశయం సాధారణ పరిమాణానికి తిరిగి రావడానికి సహాయపడుతుంది.
- ప్రసవానంతర రక్తస్రావాన్ని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.
- తల్లులు గర్భధారణ బరువును క్రమంగా తగ్గించడంలో సహాయపడుతుంది.

ప్రసవించిన గంటలోపే ముర్రిపాలు పట్టాలి

బిడ్డ పుట్టిన మూడు రోజుల్లో వచ్చే పాలను ముర్రిపాలు అంటారు. ప్రసవించిన గంట లోపే బిడ్డకు ముర్రిపాలు పట్టడం వల్ల శిశు మరణాలు తగ్గించవచ్చు. ముర్రిపాలలో విటమిన్ ఏ, సీ, డీ, ఇ, కే, ప్రొటీన్స్, మినరల్స్, క్రొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ముర్రిపాలు శిశువు ప్రేగులను శుభ్రం చేసే ప్రభావం కలిగి ఉంటాయి. ప్రేగుల్లోని బెలిరూబిన్ విసర్జింపచేయడం ద్వారా బిడ్డకు కామెర్లు తీవ్రతను తగ్గిస్తోంది. బంగారం వంటి ముర్రిపాలను ఇప్పటికీ కొందరు మహిళలు మూఢ నమ్మకాలతో బిడ్డలకు పట్టడం లేదు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ముర్రిపాల ఆవశ్యకతను చాటిచెబుతున్నారు.

బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



మొదటి 6 నెలలు తల్లి పాలే బిడ్డకు సంపూర్ణ పోషకాహారం. తల్లిపాలలో మాంసకృత్తులు, కొవ్వు, విటమిన్లు, కాల్షియం, ఇనుము ఇతర ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. తల్లిపాల వారోత్సవాలను జిల్లాలో అన్ని కేంద్రాల్లో నిర్వహిస్తున్నాం. బాలింతలు, గర్భిణులు, కౌమారదశ యువతలకు అవగాహన కలిగిస్తున్నాం. తల్లి పాల ప్రయోజనాలను తల్లులు తెలుసుకోవాలి.

– పి.శారద, ఐసీడీఎస్. జిల్లా పీడీ, ఏలూరు.

వ్యాధుల నుంచి రక్షణ



శిశువు జీవితంలో మొదటి తల్లిపాలే ప్రాథమిక వనరుగా ఉంటాయి. తల్లిపాలలో 87 శాతం నీరు, 7 శాతం కార్బోహైడ్రేట్, 4 శాతం లిపిడ్, 1 శాతం ప్రోటిన్, విటమిన్లు ఇతర ఖనిజాలు ఉంటాయి. తల్లి పాలు తీసుకున్నవారికి స్వల్ప, దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుంది. పిల్లలకు పాలు ఇవ్వడం వల్ల తల్లులూ ఆరోగ్యంగా ఉంటారు.

– డాక్టర్ కె.అన్నపూర్ణ, శీతనపల్లి పీహెచ్‌సీ

క్లుప్తంగా

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణం


నామమాత్రంగా ఉన్న భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు అయినప్పటికీ అష్టమి తిథి కావడంతో నామమాత్రంగా భక్తులు ఆలయానికి విచ్చేశారు. దాంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, కల్యాణకట్ట తదితర విభాగాల్లో భక్తుల రద్దీ స్వల్పంగా కనిపించింది. ఆదివారం భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని ఆలయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): సెప్టెంబర్ 13వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ కోరారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్ భవన్ నందు శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులతో పాటు సివిల్, వాహనం ప్రమాద బీమా, బ్యాంకు లావాదేవీలు, కుటుంబ వివాదాలు, టెలిఫోన్ బకాయిలు, చిట్ ఫండ్ కేసులు, అమలు పిటీషన్లు (ఇ.పి) రాజీ చేయడం జరుగుతుందన్నారు. కేసుల పరిష్కారంలోగానీ, మరి ఏ ఇతర సమస్యలు ఎదురైన 15100 లేదా 08812 224555ను సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న విచారణ

ఉండి: జూనియర్ లైన్‌మేన్‌పై వచ్చిన ఆరోపణలపై శనివారం మూడోరోజు కూడా విచారణ కొనసాగింది. ఉండి మండలం చెరుకువాడ, అర్తమూరు గ్రామాలకు జూనియర్ లైన్‌మేన్‌గా విధులు నిర్వర్తిస్తున్న దాసరి రాజుపై వచ్చిన ఆరోపణలపై గత మూడు రోజులుగా అధికారులు విచారణ చేస్తున్నారు. శనివారం రెండు గ్రామాల్లోను విద్యుత్ అధికారులు పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఆక్వా రైతులు, ప్రజల నుంచి సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఉండి ఎలక్ట్రికల్ ఏఈ పులగం శ్రీనివాసరావు తెలిపారు. దర్యాప్తును పూర్తిస్థాయిలో సోమవారం ముగిస్తామన్నారు.

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో వేంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు గోవింద నామ స్మరణతో పారిజాత గిరి ప్రదక్షిణ చేశారు. వారికి ప్రత్యేక దర్శనం, ప్రసాదం, అన్న ప్రసాదం ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కలగర శ్రీనివాస్ తెలిపారు. అన్నదాతలు జంగారెడ్డిగూడెం వాస్తవ్యులు సత్య గణేష్ చౌదరి, మంజుషలకు స్వామివారి వస్త్రాలు, ప్రసాదాలు, వేద పండితుల ఆశీస్సులతో సత్కరించారు. శనివారం ఆలయానికి వివిధ రూపాల్లో రూ.1,01,076 ఆదాయం లభించినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

సీఐడీ డీఎస్పీ లక్ష్మయ్య


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐడీ డీఎస్పీ లక్ష్మయ్య

నూజివీడు: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ర్యాగింగ్‌కు దూరంగా ఉండి చదువుపైనే దృష్టి సారించాలని సిఐడీ డీఎస్పీ జీ లక్ష్మయ్య పేర్కొన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలు, చట్టపరంగా తీసుకునే చర్యలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చదువు అంటే అర్థం చేసుకోవడం, అవగాహన చేసుకోవడం అనే విషయాన్ని నిజంగా గ్రహిస్తే ఇతరుల్ని మనం ర్యాగింగ్ చేయడానికి ఇష్టపడమన్నారు. ఇతరుల్ని శారీరకంగా, మానసికంగా వేధించడం మానుకోవాలని, మంచి స్నేహితుల్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించాడు. ఇతరులతో ఎగతాళిగా మాట్లాడడం, తోటి విద్యార్థులతో నువ్వు చదవలేవు అని అనడం కూడా ర్యాగింగ్ కిందకు వస్తుందన్నారు. విద్యార్థులు ర్యాగింగ్ వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిరంతరం గుర్తు చేసుకుంటూ వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పట్టుదలతో చదువుకొని భవిష్యత్‌తో ప్రయోజకులవ్వాలని విద్యార్థులకు హితవు పలికారు. దేశానికి ఉపయోగపడే పౌరులుగా మారినప్పుడే దేశం కూడా అభివృద్ధిలో ముందుకు వెళ్తుందన్నారు. అనంతరం డీఎస్పీని మెమెంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డబ్ల్యూఓలు రాజేష్, దుర్గాభవాని, చీఫ్ వార్డెన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలి

ఏలూరు (టూటౌన్): విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని, ఈనెల 5వ తేదీన విద్యుత్ భవనం వద్ద చేపట్టే ప్రజాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో శనివారం టూటౌన్ తంగేళ్లమూడి సెంటర్, గన్‌బజార్‌లలో సంతకాల సేకరణ కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచము అని కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చి, ఇప్పుడు ప్రజలపై ఆర్థిక భారము మోపేలా స్మార్ట్ మీటర్లను బిగించే కార్యక్రమాన్ని చేపట్టడం దారుణమన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలు ఉపాధి లేక,, ఉద్యోగాలు లేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగ ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పిచ్చుకల ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.


స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఏలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాలు

ప్రాణాలు తీసిన అతివేగం


సాజాన్ మృతదేహం


వ్యాన్‌లో ఇరుక్కున్న మీరా మహబూబ్ మృతదేహం

ద్వారకాతిరుమల: ఒక డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త రెండు నిండు ప్రాణాలను బలిగొంది. మృతుల కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. మండలంలోని లైన్ గోపాలపురం జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి ముందు వెళుతున్న ఇసుక లారీని, కోళ్ల వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఒకరు తీవ్ర గాయాలపాలైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి వ్యాన్ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యమే కారణం. పోలీసుల కథనం ప్రకారం. గుంటూరు జిల్లా, వాడేపల్లికి చెందిన షేక్ మీరా మహబూబ్(30) గుంటూరులోని ఏకే చికెన్ ఫ్యాక్టరీలో గత 9 ఏళ్ల నుంచి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే ఫ్యాక్టరీలో సౌత్ ఢిల్లీకి చెందిన మహ్మద్ సాజాన్(27), ఎండీ కలిమ్ ఆలాం కూలీలుగా పనిచేస్తున్నారు. గత శుక్రవారం సాయంత్రం ఈ ముగ్గురు వ్యాన్‌లో జంగారెడ్డిగూడెం మండలం కొయ్యలగూడెంకు వెళ్లారు. అక్కడ కోళ్లను లోడ్ చేసుకుని, తాడేపల్లికి బయల్దేరి వెళుతున్నారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి బ్రిడ్జి ఎక్కే సమయంలో డ్రైవర్ మీరా మహబూబ్ వ్యాన్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ముందు (ఏలూరు వైపునకు) వెళుతున్న ఇసుక లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మీరా మహబూబ్, సాజాన్ అక్కడికక్కడే మృతి చెందగా, కలిమ్ ఆలాంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటీన క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు మహబూబ్ సోదరుడు షేక్ ఇస్మాయేలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

కొండ దిగి రాలేం.. సౌకర్యాలు కల్పించండి

మోదేలు గిరిజనుల వేడుకోలు

బుట్టాయగూడెం: మారుమూల అటవీ ప్రాంతంలో బాహ్యప్రపంచానికి దూరంగా జీవిస్తున్న మోదేలు గిరిజనులు తమ ప్రాంతాన్ని విడిచి రాలేమని, తమకు మౌలిక సదుపాయాలు కల్పించాలని వేడుకుంటున్నారు. శనివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందే తాము మోదేలు గ్రామాన్ని ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. మోదేలు గ్రామం వేలేరుపాడు మండలానికి దూరంగా, బుట్టాయగూడెం మండలానికి దగ్గరగా ఉందని, తమ గ్రామానికి సరైన రహదారి లేక అనేక అవస్థలు పడుతున్నామని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో తమకు విద్యుత్ సదుపాయంతోపాటు రోడ్డు సౌకర్యం కూడా మంజూరైందని, పనులు ప్రారంభించే సమయంలో ఫారెస్ట్ అధికారుల అభ్యంతరాలతో అవి ఆగిపోయాయన్నారు. కొద్ది నెలల క్రితం ప్రధాన మంత్రి ఆవాస యోజనా పథకంలో కూడా 22 నివాస గృహాలు మంజూరయ్యాయని, ఫారెస్ట్ అధికారులు అభ్యంతరాలు చెప్పడంతో అవి కూడా నిలిచిపోయాయన్నారు. దీంతో తమ బాధలను వివరిస్తూ ఇటీవల రాష్ట్రపతికి ఒక వినతిపత్రాన్ని పంపించామని, దీనిపై విచారణకు వచ్చిన ఐటీడీఏ పీఓ తమపై అసభ్యకరమైన పదజాలంతో మండిపడ్డారని తాము చేసిన నేరమేంటని ప్రశ్నించారు. తమ గ్రామం విడిచి వెళ్లిపోవాలంటూ తమను భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపించారు. కరెంట్ లేక అడవి దోమలు కుట్టి అనేక ఇబ్బందులు పడుతున్న తమకు సౌకర్యాలు కల్పించాల్సిందేనని చెప్పారు. ఇదే విషయాన్ని గిరిజన సంక్షేమ కమిషన్‌కు ఒక లెటర్ ద్వారా తెలియపరిచామన్నారు. తాము కొండ దిగిరామని, ఉన్న ప్రదేశంలోనే తమకు సౌకర్యాలు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

రవాణా కార్యాలయాల్లో ఎక్సైజ్ తనిఖీలు

తణుకు అర్బన్: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం తణుకు పట్టణంలోని పలు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, గోడౌన్‌లు, ఏపీఎస్ ఆర్టీసీ కార్గో సర్వీస్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి మాట్లాడుతూ రవాణా కార్యాలయాల్లో సరుకులు, సామాగ్రి రవాణా చేసే క్రమంలో పూర్తిస్థాయిలో సిబ్బంది పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ చట్టం ప్రకారం ఎన్‌డీపీఎస్ చట్టం పరిధిలోకి వచ్చే ఆల్కహాలు, సారా, గంజాయి, ఇతర డ్రగ్స్ రవాణా చేయుటకు అనుమతిస్తే ఆ కార్యాలయాలు, సిబ్బందిపై చర్యలు తప్పవని అన్నారు. అనుమానిత సామాగ్రిని గుర్తిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


తణుకు కార్గో సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ సీఐ మణికంఠరెడ్డి

శ్రీవారి సేవలో..


కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించిన స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ జోన్-2 రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ క్రాంతి కుమారి

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని శనివారం స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ జోన్–2 రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ బీఆర్ క్రాంతి కుమారి సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆమెకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వేద ఆశీర్వచనం అందజేసి సత్కరించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

ముదినేపల్లి రూరల్: ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ.7 లక్షలు వసూలు చేసి ఆనక మోసం చేసిన వైనంపై శనివారం పోలీస్ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లికి చెందిన బూసి చిరంజీవి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి గురజకు చెందిన పి విక్రమ్ పరిచయమై తాను ప్రముఖ రాజకీయ నాయకుల వద్ద కారు డ్రైవర్‌గా చేస్తుంటానని, ఆ పలుకుబడితో చిరంజీవి కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. పలు దఫాలుగా ఫోన్‌పే, రొక్కముగా రూ.7 లక్షలు వసూలు చేశాడు. అనంతరం ఉద్యోగం గురించి చిరంజీవి ఎన్నిసార్లు విక్రమ్‌ను ప్రశ్నించినా సమాధానం దాటవేయడంతో మోసపోయానని గ్రహించి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

శ్రీవిష్ణు డెంటల్ కళాశాలలో రాష్ట్రస్థాయి సదస్సు


శ్రీవిష్ణు డెంటల్ కళాశాలలో నిర్వహిస్తున్న సదస్సు

భీమవరం: పట్టణంలోని శ్రీవిష్ణు డెంటల్ కళాశాలలో 11వ ఐపీఎస్ రాష్ట్ర సమావేశం శనివారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ రామరాజు చెప్పారు. ఈ సందర్భంగా ఫ్యాకల్టీ, విద్యార్థుల మార్పిడి, పరిశోధన, ప్రచురణలు, క్లినికల్ శిక్షణ వంటి కార్యకలాపాలకోసం విష్ణు డెంటల్ కళాశాల, వియత్నంలోని కాన్‌థో యూనివర్సిటీ ఆఫ్ మెడిసిన్ అండ్ ఫార్మసీ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు రామరాజు చెప్పారు. సమావేశంలో రాష్ట్రంలోని వివిధ డెంటల్ కళాశాలలకు చెందిన సుమారు 200 మంది ప్రతినిధులు పాల్గొనగా పీజీ విద్యార్థులు పరిశోధన పత్రాలను సమర్పించారన్నారు. కళాశాల వైస్ చైర్మన్ రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుల అరెస్ట్

టి.నరసాపురం: పొగాకు బేళ్ల చోరీ నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై జయబాబు తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన భూక్యా భాస్కరరావుకు చెందిన 14 పొగాకు బేళ్ల చోరీపై జూలై 28న ఫిర్యాదు చేశాడు. కేసును దర్యాప్తు చేసిన పోలీసులు శనివారం నలుగురిని నిందితులుగా గుర్తించి వారిని అరెస్ట్ చేసి అనంతరం రిమాండ్‌కు పంపారు. నిందితులతోపాటు పొగాకు బేళ్లు కలిగిన వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

ముదురుతున్న రోడ్డు ఏర్పాటు వివాదం


భవిష్యత్ కార్యాచరణపై సమావేశమైన దళితులు

ఉండి: పాములపర్రు గ్రామంలో శ్మశానవాటిక నుంచి రోడ్డు వేయాలని అధికారులు పట్టుదలకు పోవడంతో వివాదం రోజురోజుకు ముదురుతోంది. శ్మశానంలో నుంచి ఆక్వా చెరువులకు రోడ్డు వేయవద్దంటూ గత నెల 31వ తేదీన మొదటిగా దళితులు నిరసన తెలిపారు. దీంతో తహసీల్దార్ నాగార్జున తాను 2వ తేదీ వచ్చి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో దళితులు నిరసన విరమించారు. అయితే శనివారం ఆయన రాకపోగా అధికారులను పంపించి రోడ్డు నిర్మాణానికి కొలతలు వేసే కార్యక్రమం చేపట్టడంతో దళితులు ఒక్కసారిగా పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. దీంతో గ్రామ పెద్దలు వచ్చి నచ్చజెప్పడంతో నిరసన విరమించి మాట్లాడుకునేందుకు అంగీకరించారు. కానీ గ్రామ పెద్దలు గానీ, అధికారులు గానీ రాకపోవడంతో దళిత సంఘాలను సమీకరించి భవిష్యత్ కార్యాచరణపై గ్రామంలో సమావేశమయ్యారు. దారి అడిగిన ఆక్వారైతులు వారి భూములను త్యాగం చేసి రోడ్డు వేసుకోవచ్చు కదా అంటూ దళితులు మండిపడుతున్నారు. పంచాయితీ రికార్డుల్లో కూడా శ్మశానవాటిక భూమి అని ఉందని, దళితులకు పవిత్రమైన శ్మశాన భూమిలో రోడ్డు వేసి మా మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించొద్దని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ నాయకులు, స్థానిక దళిత నాయకులు, అధికారులు డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణరాజు, సీఐ జగదీశ్వర్, ఎస్సై ఎండీ నసీరుల్లా పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



విప్పర్రు వెంకటేశ్వరుని ఆలయంలో స్వామివారిని దర్శించుకొంటున్న భక్తులు

పెంటపాడు: మండలంలో శనివారం విప్పర్రు గ్రామంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త బోణం వీరయ్య ఆధ్వర్యంలో అర్చకులు శనివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. విప్పర్రు గ్రామంతో పాటు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించి తరించారు.

వరాల వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: మండలంలోనిఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల్ సేవ జరిపారు. హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

18,361 మందికి అన్నదాత సుఖీభవ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం కింద 18,361మంది రైతులకు రూ.12.41కోట్లు మంజూరైందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి - అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మండల వ్యవసాయాధికారి నారాయణరావు అధ్యక్షత వహించారు.

నాగమ్మకు భక్తులు సారె సమర్పణ



భక్తులు సమర్పించిన సారెతో నాగమ్మ తల్లి

తణుకు అర్బన్: తణుకు జాతీయరహదారికి సమీపంలోని శ్రీచక్రసహిత నాగ దుర్గాదేవి ఆలయంలో నాగమ్మ తల్లికి భక్తులు సారె సమర్పించారు. ప్రతి ఏడాది భక్తులు అమ్మవారికి అందించే సారెలో భాగంగా శనివారం పైడిపర్రుతోపాటు తణుకు పట్టణ నలుమూలల నుంచి మిఠాయి, పసుపు, కుంకుమ, గాజులు, రవికెల క్లాత్, అరటి గెలలు భక్తులు సారె రూపంలో తీసుకువచ్చి అమ్మవారి విగ్రహం వద్ద ఉంచారు. శనివారం రాత్రి అమ్మవారి ముందు నిద్రచేయించి ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు భక్తులకు అందజేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజాదికాలు జరిపిస్తామని, సారె ప్రసాదాన్ని భక్తులు స్వీకరించాలని కోరారు.

రోడ్లు ఇలా.. ప్రయాణమెలా?

- తారు ప్యాచ్‌వర్క్ పనులు ధ్వంసం
- రాళ్లులేచి ప్రమాదకరంగా మారుతున్న వైనం
- పనుల్లో నాణ్యత కొరవడుతున్న దుస్థితి



తణుకు రాష్ట్రపతి రోడ్డులో ధ్వంసమైన ప్యాచ్‌వర్క్

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం రాగానే రోడ్లకు ముందుగా మరమ్మతులు చేసేస్తాం, సంక్రాంతి లోపు రోడ్లన్నీ అభివృద్ధి చేసేస్తాం అన్న మాటలు నీటి మూటలుగా మిగిలాయి. తణుకు మునిసిపాలిటీ పరిధిలో ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో తారురోడ్డుపై ప్యాచ్‌వర్క్ చేసిన పనులు నాణ్యతలోపంతో ధ్వంసమైపోతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే ఇలా ధ్వంసమైపోతే పూర్తయ్యేలోపు గోతులమయమేనా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తణుకు మునిసిపాలిటీలో సుమారుగా రూ. 10 లక్షల నిధులతో కూటమి ప్రభుత్వంలో చేసిన ప్యాచ్‌వర్క్ పనులు 6 నెలల లోపే శిథిలావస్థకుచేరి నేడు రాళ్లు లేచిపోయిన దుస్థితి నెలకొంది. తారుతో వేసిన ప్యాచ్‌వర్క్ పనులు చాలాచోట్ల రాళ్లులేచిపోయి ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రపతి రోడ్డుతోపాటు ఉండ్రాజవరం రోడ్డు, వేల్పూరు రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, సొసైటీ రోడ్డుల్లో చేసిన ప్యాచ్‌వర్క్‌ల పనుల్లో ముఖ్యంగా రాష్ట్రపతి రోడ్డులో ఈ ప్యాచ్‌వర్క్ పనులు తీవ్ర దుమారాన్ని లేపుతున్నాయి. పాత రోడ్డు బాగానే ఉన్నప్పటికీ కేవలం ప్యాచ్‌వర్క్ చేసిన ప్రాంతం మాత్రమే ధ్వంసమవ్వడంతో పనులు ఎంత నాణ్యతతో చేశారోనంటూ తణుకువాసులు చర్చించుకుంటున్నారు. రాష్ట్రపతి రోడ్డు పొడవునా వేసిన తారు ప్యాచ్‌వర్క్ పనులు చాలాచోట్ల ధ్వంసమైపోయి రాళ్లు రజనుగా మారి వాహనాలు అదుపుతప్పి ప్రయాణికులు ప్రమాదాలపాలవుతున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల పూర్తిగా ధ్వంసంకాగా మరికొన్ని సైతం ధ్వంసమయ్యేందుకు సిద్ధంగా ఉన్నాయి.

తారు పొదుపు చేశారా..

ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో కొలతల కోసమా అన్నట్లుగా సాగదీసి వేసిన ప్యాచ్‌వర్క్ పనులు అప్పట్లోనే వివాదాస్పదంగా మారాయి. ప్యాచ్‌వర్క్ చేసిన ప్రాంతంలో శుభ్రం చేయకుండా హడావుడిగా వేసేయడం అది కూడా ఖరీదైన తారును చాలా పొదుపుగా వాడకం వలన ఈ ప్యాచ్‌వర్క్ పనులు కనీసం వర్షాకాలం పూర్తయ్యేవరకు కూడా ఉండేలా లేవని ప్రజానీకం విమర్శిస్తున్నారు. ప్యాచ్‌వర్క్ చేసిన చోట తారు సరిపోక రాళ్లు కనిపిస్తున్నాయని పనుల సందర్భంలోనే సాక్షిలో కథనం ప్రచురించినా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.



తణుకు రాజేంద్రభవన్ ముందు ధ్వంసమైన ప్యాచ్‌వర్క్



తణుకు తంగిరాల వారి వీధి ముందు ధ్వంసమైన ప్యాచ్‌వర్క్ పనులు



తణుకు రాష్ట్రపతి రోడ్డులో ధ్వంసమైన ప్యాచ్‌వర్క్ పనులు

బీఎస్ఎన్ఎల్ ఆఫర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఆధ్వర్యంలో కేవలం ఒక్క రూపాయికే ఉచితంగా సిమ్ అందజేస్తామని తాడేపల్లిగూడెం డీఈ కేవీఏపీ సుబ్బారావు వెల్లడించారు. సిమ్‌తో పాటు అన్ లిమిటెడ్ కాల్స్, రోజు 2 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లను 30 రోజుల కాల పరిమితితో ఉపయోగించు కోవచ్చునని వెల్లడించారు. ఈ పథకం ఈ నెల 31 వరకు అందుబాటులో ఉంటుందని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీఎస్ఎన్ఎల్ 4 జీ సేవలను విరివిగా వినియోగించుకోవాలని, ఈ సేవలు కొరకు వినియోగదారులు దగ్గర్లో ఉన్న బీఎస్ఎన్ఎల్ కష్టమర్ సర్వీస్ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు.

క్రీస్తు బోధనలతో ఆధ్యాత్మిక అభివృద్ధి

ఈపీఎఫ్‌లో ముగిసిన ఉపవాస ప్రార్థనలు

పెంటపాడు: యేసు క్రీస్తును నమ్మిన విశ్వాసులకు ఆయన బోధనల ద్వారానే ఆధ్యాత్మిక అభివృద్ధి సాధ్యమని ఈపీఎఫ్ సంఘ అధ్యక్షుడు పాస్టర్ మోజస్ ప్రవీణ్ పేర్కొన్నారు. గత మూడు రోజుల నుంచి తణుకులోని పైడిపర్రు ఇమ్మానియేలు ప్రేయర్ ఫెలోషిప్‌లో జరుగుతున్న ఉపవాస ప్రార్థనలు శనివారం రాత్రితో ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకురాలు పి. అరుణకుమారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పార్థనలలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని పార్థనలు, విజ్ఞాపనలు చేశారు. రాత్రి సంపూర్ణరాత్రి ఉపవాస ప్రార్థన ఘనంగా నిర్వహించారు. సంఘ సేవకురాలు ప్రెజీ ప్రవీణ్, విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వంచనతోనే కూటమి పాలన

- సంక్షేమం ఇవ్వలేక అక్రమ అరెస్టులు, నిర్బంధాలు
- తణుకులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి



తణుకు 5వ వార్డులో మహిళకు కరపత్రం అందిస్తున్న మాజీ మంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనంతా మోసాలతోనే సాగిందని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. సూపర్‌సిక్స్ అమలు చేయలేక వైఎస్సార్ సీపీ నేతలను అక్రమ అరెస్టులు చేస్తూ ప్రజల చూపు మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తణుకులో 2, 5 వార్డుల్లో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలంతా సూపర్ సిక్స్ పథకాల కోసం ఎదురుచూస్తూ అలో లక్ష్మణా అంటూ నిస్సహాయ స్థితిలో ఉన్నారని అన్నారు. గత ఐదేళ్లు పారదర్శకంగా అందిన సంక్షేమ పాలనను గుర్తు చేసుకుంటూ ప్రజలు కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలకు దిగుతున్నారని, వారిని భయపెట్టేందుకు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. నెల్లూరులో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనను అడ్డుకోవాలని ఎన్ని అడ్డదారులు తొక్కినా జనాభిమానం జగన్‌కు మెండుగా దక్కిందన్నారు. రోడ్లు తవ్వేసి, ముళ్ల కంచలు వేసి, పోలీసులు లాఠీచార్జ్‌లు చేసి భయభ్రాంతులకు గురిచేసినా జగన్‌ను చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారని అన్నారు. సంక్షేమం అందక ప్రజల్లో కొనుగోలు శక్తి పోయిందని తద్వారా వ్యాపారరంగం కుదేలైపోయిందని స్పష్టం చేశారు.

విచ్చలవిడిగా జూదం, బెట్టింగ్, మద్యం..

చంద్రబాబు కూటమి ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా పేకాటలు విస్తరించాయని, క్రికెట్ బుకీల తాకిడి పెరిగిందని, ఇక మద్యాన్ని డోర్ డెలివరీ చేశారని, 24 గంటలూ మద్యం అందుబాటులోకి తీసుకువచ్చారని దుయ్యబట్టారు. ఒక పక్క సంక్షేమం అందకపోగా మరోపక్క పేకాటల హోరుకు కుటుంబాలు నాశనం అయిపోతున్నాయని, మహిళల మెడలో తాడు కూడా అమ్మి పేకాటలో కూర్చునే పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రభుత్వం చేసిన మోసాని తెలిపే విధంగా క్యూఆర్ కోడ్‌తో ఉన్న కరపత్రాలను ప్రజలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, పంచాయితీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, 5వ వార్డు నాయకులు కాకరపర్తి ఆంజనేయులు, సందాపు దుర్గారావు, దాసి రత్నరాజు, సుమల సాయి చంద్రశేఖర్, తణుకు సత్యనారాయణ, 2వ వార్డు నాయకులు రంభ నాగేశ్వరరావు, షేక్ మీరావల్లి, గుత్తుల బాలాజీ, సురేష్, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనక దుర్గ, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ నత్తా కృష్ణవేణి, షేక్ ఫహీమా, బొద్దాని శ్రీనివాస్, గెద్దాడి శ్రీకాంత్, పైబోయిన ఏసుబాబు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సుగర్ వ్యాధి ఉచిత రక్త పరీక్ష శిబిరం స్థానిక కడకట్ల గొల్లగూడెం సెంటర్‌లో శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగింది. జనతా ట్రస్ట్ నిర్వహణలో అధ్యక్షుడు చిన్నం మనీంద్రచే దాత బాపయ్యశర్మ ఆర్థిక సహకారంతో జరిగిన శిబిరంలో126 మంది పేషెంట్లుకు ఉచిత రక్త పరీక్షలు జరిగాయి. తొలుత స్థానిక అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ జీఎస్టీ కాసా రాజ్యలక్ష్మి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ ప్రతి రోజు తగిన వ్యాయమం, మిత ఆహారం తీసుకోవాలని, షుగర్ వ్యాధిని అదుపులో పెట్టుకోవాలని తగు సూచనలు చేశారు. కార్యదర్శి త్రిమూర్తులు, కోశాధికారి కిరణ్, సుంకర శ్రీనివాస్, మదన్మోహనే అగర్వాల్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, వంగపండు రామ్మోహన్‌రావు, డీవీపీ విశ్వేశ్వర రావు, లక్ష్మీనారాయణ, పడాల మహేశ్వరరావు, సన్నిధి సూర్యనారాయణమూర్తి, వెంకటేశ్వరరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



పైడిపర్రులో మొక్కలు నాటుతున్న శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం సభ్యులు

తణుకు అర్బన్: శ్రీ విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం, పిఠాపురం అనుబంధ సంస్థ ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తణుకు మండలం పైడిపర్రులో శనివారం మొక్కలు నాటారు. పీఠం అష్టమ పీఠాధిపతి పరబ్రహ్మ మొహియద్దీన్ భాషా సద్గురువర్యుల వర్ధంతి సందర్భంగా పీఠం సభ్యులు మేనేడి వెంకట నరసింహారావు, రామలక్ష్మి దంపతుల సౌజన్యంతో మొక్కలు నాటి వాటిని పెంచే కార్యక్రమం చేపట్టారు. మొక్కలు పెంచకపోతే భావి తరాలకు ఆక్సిజన్ అందక విపత్కర పరిస్థితులు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ వల్లూరి రామకృష్ణ, కాట్రెడ్డి షాబాబు, దంగేటి రామకృష్ణ, బడేటి సత్యనారాయణ తాండ రవికుమార్, సుధాకర్, శ్రీనివాసు, సత్యనారాయణ, పీఠం సభ్యులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు మామిడి దానవరప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే ట్రూ అప్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై మోయలేని భారాన్ని వేసిందన్నారు. విద్యుత్ వినియోగదారులపై మరో బాదుడుకు కేంద్రం సిద్ధమైందని దుయ్యబట్టారు. ఈ ప్రతిపాదనలపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 14వ తేదిలోపు చెప్పాలని ఈఆర్‌సీ కార్యదర్శి కృష్ణ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారన్నారు. ప్రతిపాదనలను వెంటనే విరమించాలని కోరారు. నీలం సత్తిబాబు, మంచాల సత్తిపండు, దుర్గారావు, సత్యనారాయణ, రాంబాబు, నాగేశ్వరరావు, రామారావు, రామకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ స్కిల్స్‌పై తల్లిదండ్రులకు అవగాహన



భవిత విద్యార్థులకు అవగాహన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మేనరిక వివాహాలను ప్రోత్సహించవద్దని భవిత సెంటర్ నిర్వాహకులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు. పాఠశాలకు రాలేని దివ్యాంగుల పిల్లలు ఇంటికి వెళ్లి అవసరమైన స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ సేవలు అందజేశారు. లైఫ్ స్కిల్స్‌పై శనివారం తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ మానసిక దివ్యాంగులకు వివాహాలు చేయడం సరికాదన్నారు. గర్భిణులు అనుభవజ్ఞులైన వైద్యుల సలహాలు సూచనలు పాటించాలన్నారు. ప్రతి దివ్యాంగుల పిల్లలు యూడీఐడీ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని యూనిక్ ఐడీ కార్డు కోసం, పిల్లవాని సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫోటోలతో ఏరియా ఆసుపత్రిను సంప్రదించాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పార్శిల్ కార్యాలయంలో విస్తృత తనిఖీలు



గూడెంలో పార్శిల్ కార్యాలయంలో విస్తృత తనిఖీలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక పార్శిల్ కార్యాలయంలో, లారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో ఎక్సైజ్ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం విస్తృత తనిఖీలు చేశారు. పార్శిల్, ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలోని సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఇనస్పెక్టర్ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ పార్శిల్, రవాణా సంస్థలు తాము డెలివరీ చేయబోవు సరుకులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పార్శిల్ ద్వారా ఎన్‌డీపీఎల్ మద్యం, స్పిరిట్, గంజాయ్, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలను తరలించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తమ వద్దకు వచ్చే అనుమానిత పార్శిల్ వివరాలను ఎక్సైజ్ సిబ్బందికి తప్పక తెలియజేయాలని కోరారు. చట్ట విరుద్ధమైన వస్తువులు రవాణా చేస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

4న గురుకుల ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల (బాలుర)లో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 4వ తేదిన స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎం.దుర్గారావు ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 13 సీట్లు కాగా, ఎస్సీ మాలకు మూడు సీట్లు, ఎస్టీకి నాలుగు, బీసీ-సీ క్రిస్టియన్ ఐదు, ఓసీ ఒకటి, పదవ తరగతిలో ఎస్టీకి మూడు, బీసీ-సీ క్రిస్టియన్ రెండు, బీసీ రెండు సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఏడు సీట్లకు గాను ఎస్సీ మాదిగ ఒకటి, మాలకు రెండు, ఎస్టీకి ఒకటి, బీసీ-సీ క్రిస్టియన్ రెండు, బీసీ ఒకటి, ద్వితీయ సంవత్సరంలో 14 సీట్లకు గాను ఎస్సీ మాదిగ ఒకటి, మాల మూడు, ఎస్టీ మూడు, బీసీ-సీ క్రిస్టియన్ ఐదు, బీసీ ఒకటి, ఓసీ ఒకటి కేటాయించినట్లు వివరించారు. మొత్తం 41 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. కేటగిరీల ప్రకారం కేటాయించిన సీట్లు మిగిలితే వాటిని ఎస్సీలకు బదలాయించనున్నట్లు తెలిపారు. ఖాళీ సీట్లలో చేరదలచుకున్న విద్యార్థులు సంబంధిత ధృవపత్రాలతో సోమవారం స్పాట్ కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 9704550050ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

పాలకొల్లు సెంట్రల్: యుక్త వయస్సులోనే స్వాతంత్రోద్యమంలో పాల్గొని ఎందరో మన్ననలు పొందిన దేశభక్తుడు పింగళి వెంకయ్య అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి అన్నారు. శనివారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ పరిశోధకునిగా, అధ్యాపకుడిగా, శ్రమజీవిగా, బహు భాషావేత్తగా ఆయన జీవితం ఎంతో ఆదర్శవంతమైనదన్నారు. ముందుగా వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, అధ్యాపకులు జాన్‌రాజ్, పాల్గొన్నారు.

నాడీ సంబంధిత వ్యాధులపై అవగాహన

పెనుగొండ: ప్రస్తుత సమాజంలో చాలా మంది నాడీ సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నార ని తమిళనాడు సాయి యూనివర్శిటీ ఆచార్య డాక్ట ర్ అనిల్ అన్నమనీడి అన్నా రు. పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో లైఫ్‌సైన్స్ విభాగం, బయోటెక్రాలజీ, బయోకెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ విభాగాల్లో ఏర్పాటు చేసిన నాడీ సంబందిత వ్యాధులపై సమాచార బదిలీ ప్రోటీన్ల పాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. నాడీ సంబంధిత వ్యాధులు అల్జీమర్స్, పార్కికిన్, సన్స్ వ్యాధులతో మాత్రమే కాకుండా, నాడులను దెబ్బతీసే ప్రమాదకరమైన వ్యాధులు ఇంకా చాలా ఉన్నాయన్నారు. వాటిని సమాచార బదిలీ ప్రోటీన్ల ద్వారా కొంతవరకూ అదుపు చేయవచ్చునన్నారు. జర్మనీలో తాను చేసిన పరిశోధనలో భాగంగా బసూన్ ప్రోటీన్ పని చేసే విధానాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు మాట్లాడుతూ నేటి తరానికి నాడీ సంబంధిత వ్యాధులపై అవగాహన చాలా అవసరమన్నారు. బయోటెక్నాలజీ విభాగాధిపతి టి.రమేష్, బయో కెమిస్ట్రీ అధ్యాపకుడు టి.దివాకర్, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

బాధితులకు సాయం

పాలకొల్లు సెంట్రల్: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురు అనారోగ్య బాధితులకు రూ. 30 వేలు ఆర్థిక సహాయం అందించినట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధరాజు తెలిపారు. శనివారం ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు అందించిన ఆర్థిక సహాయాన్ని బాధితులకు రూ. 10 వేలు చొప్పున అందజేశారు. కోమటితిప్ప, ధర్బరేవు, చింతపర్రు గ్రామాలకు చెందిన ముగ్గురు బాధితులకు ఆర్థిక సహాయం అందించినట్లు వివరించారు.